క్లుప్తంగా

ఆలయ అభివృద్ధికి నిధులు



బాన్సువాడ : పట్టణంలో ఉన్న రామాలయ అభివృద్ధికి రూ.30 లక్షల నిధులు మంజూరు చేస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం రామాలయాన్ని సందర్శించిన స్పీకర్ ఆలయ కమిటీతో మాట్లాడారు. రామ మందిరం వద్ద స్థలం ఉందని, ఆ స్థలంలో ఆలయం అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. నియోజకవర్గంలో పలు ఆలయాలకు నిధులు మంజూరు చేశామన్నారు. అన్నివర్గాలకు సమన్యాయం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రమాకాంత్, లక్ష్మీనారాయణ, లక్ష్మారెడ్డి, మోహన్‌రెడ్డి, తాటి రాము, కిరణ్‌కుమార్, అంజిరెడ్డి తదితరులు ఉన్నారు.

మొక్కలను సంరక్షించండి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): పల్లె ప్రకృతివనంలో గతంలో నాటిన మొక్కలతోపాటు ప్రస్తుతం నాటుతున్న మొక్కలను సంరక్షించేందుకు తగిన చర్యలు చేపట్టాలని నాగిరెడ్డిపేట ఎంపీడీవో రఘు సూచించారు. మాల్తుమ్మెద పల్లె ప్రకృతివనాన్ని శనివారం ఆయన సందర్శించారు. మొక్కల మధ్య పెరిగిన గడ్డి, పిచ్చిమొక్కలను తొలగించాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి నర్సింలు, ఫీల్డ్‌అసిస్టెంట్ సాయిలు ఉన్నారు.

కేజ్‌వీల్ ట్రాక్టర్లు నడిపేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి

పిట్లం(జుక్కల్): కేజ్‌వీల్ ట్రాక్టర్లు నడిపేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్సై విజయ్ కొండ సూచించారు. ఆయన చిన్నకొడప్గల్‌లో ట్రాక్టర్ డ్రైవర్‌లు, యజమానులతో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలకు సంబంధించి కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై పలు సూచనలు ఇచ్చారు.

యజమానులకు నోటీసులు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని 41 గ్రామ పంచాయితీల పరిధిలోని ఆయా గ్రామాలు, తండాలకు చెందిన కేజ్ వీల్ ట్రాక్టర్ యజమానులకు శనివారం పోలీసులు నోటీసులు అందజేశారు. ఖరీఫ్ సీజన్‌లో కేజ్ వీల్స్‌ను ట్రాక్టర్‌లకు ఏర్పాటు చేసుకొని బీటీ రోడ్లపై నడిపితే కేసులు నమోదు చేస్తామన్నారు. బీటీ రోడ్లపై కేజ్ వీల్ ట్రాక్టర్లు నడిపితే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. వారి ట్రాక్టర్లు సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

పాము కాటు మృతులకు ఎమ్మెల్యే నివాళి

రాజంపేట: శేర్‌శంకర్ తండా జీపీ పరిధిలోని మూడు మామిళ్లతండాలో తండ్రీ కొడుకులు పాము కాటుకు గురై చనిపోయిన విషయాన్ని స్థానిక నాయకులు ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే సురేందర్, తండాకు చేరుకుని ముద్రిచ్చ రవి, వినోద్‌లకు నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని ఓదార్చి రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఆపద్బంధు ద్వారా మరింత ఆర్థిక సహాయం అందేలా చూస్తానని, ఈ విషయాన్ని సీఎం దృష్టికి సైతం తీసుకెళ్తానని భరోసా కల్పించారు.


వీడీసీని రద్దు చేసే అధికారం లేదు

భిక్కనూరు: వీడీసీని రద్దు చేసే అధికారం జీపీ పాలకవర్గానికి లేదని మండలంలోని కాచాపూర్ వీడీసీ అధ్యక్షుడు మైపాల్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడారు. గ్రామంలో అన్ని కులాలలకు, యువజన సంఘాలకు చెందిన 44 మంది సభ్యులు కల్సి గ్రామాభివృద్ధి కోసం వీడీసీ ఏర్పాటు చేసుకున్నారని అన్నారు. వీరందరూ కల్సి తనను అధ్యక్షుడిగా ఎన్నుకున్నారని, గ్రామాన్ని కబలిస్తున్న ఎంఎస్ఎన్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా ప్రజలతో కల్సి ఉద్యమం నిర్వహిస్తున్నందున ప్రజాప్రతినిధులు తమపై కక్ష పెట్టుకుని వీడీసీని రద్దు చేశామని ప్రచారం చేయడం తగదన్నారు. వీడీసీని రద్దు చేయడమనేది జీపీ పరిధిలోకి రాదన్నారు.

బిచ్కుంద ఎస్సైకి పదోన్నతి

బిచ్కుంద(జుక్కల్): మండల ఎస్సైగా ఉన్న శ్రీధర్‌రెడ్డి సీఐగా పదోన్నతి పొందారు. ఈ మేరకు ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆయన గత సంవత్సరం నుంచి బిచ్కుంద ఎస్సైగా సేవలు అందించారు. బిచ్కుంద పోలీస్ స్టేషన్ వారం రోజు క్రితం ఉత్తమ పోలీస్ స్టేషన్‌గా అవార్డు అందుకుంది. ప్రజల సహకారం వల్ల ఉత్తమ పోలీస్ స్టేషన్‌గా అవార్డు అందుకోవడం గర్వ కారణమని సీఐ కృష్ణ తెలిపారు.

కనీస వేతనం చెల్లించాలి



సాక్షి నెట్‌వర్క్ : జిల్లాలో పంచాయతీ కార్మికుల సమ్మె శనివారం నాటికి 17వ రోజుకు చేరింది. తమ న్యాయమైన కోర్కెలు తీర్చాలని జీపీ కార్మికులు ప్రభుత్వాన్ని కోరారు. కనీస వేతనం చెల్లించాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించే వరకు సమ్మెను ఆపబోమని స్పష్టం చేశారు. పలు పార్టీల నేతలు సంఘీభావం తెలిపారు.

ప్రమాదకరంగా ప్రయాణ ప్రాంగణం

- స్లాబ్‌కు ఏర్పడ్డ రంధ్రాలు
- వర్షాలకు పెచ్చులూడుతున్న వైనం

దోమకొండ: దోమకొండలోని ప్రయాణ ప్రాంగణం ప్రమాదకర స్థితికి చేరుకుంది. బస్టాండ్ స్లాబ్‌కు రంధ్రాలు ఏర్పడ్డాయి. దీనికి తోడు నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు స్లాబ్ పైభాగం పూర్తిగా దెబ్బతిని పెచ్చులూడుతున్నాయి. స్లాబ్ వర్షానికి పూర్తిగా తడిసి నీళ్లు కారుతున్నాయి. దీంతో ప్రయాణికులు నిల్చోడానికి కూడా ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండ్‌ను 1988లో అప్పటి ప్రభుత్వం గ్రామీణ క్రాంతి పథకం కింద నిర్మించింది. బస్టాండ్ నిర్మాణం జరిగి దాదాపు 35 సంవత్సరాలు కావస్తుంది. దోమకొండ మీదుగా ప్రతిరోజు సిద్దిపేట జిల్లా దుబ్బాక ప్రాంతంతో పాటు భిక్కనూరు మండలం, బీబీపేట మండలానికి చెందిన గ్రామాలకు బస్సులు నడుస్తుంటాయి. వందలాది మంది ప్రయాణికులు నిత్యం ప్రయాణం చేస్తుంటారు. ఇటీవల బస్టాండ్ మరమ్మతుల కోసం ఆర్టీసీ అధికారులు రూ.29 లక్షలు మంజూరు చేశారు. బస్టాండ్ స్లాబ్ కొంతభాగం తొలగించి తిరిగి నూతనంగా స్లాబ్ వేయాలని నిర్ణయించారు. కాని స్లాబ్ పైభాగం తొలగించే పనులు మొదలు కాగానే వర్షం కురియడంతో పనులు నిలిచిపోయాయి. మరమ్మతులు త్వరగా పూర్తి చేయకుంటే స్లాబ్ కూలిపోయే ప్రమాదముందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



దోమకొండ బస్టాండ్ పరిస్థితి

నిలబడాలంటే భయమేస్తోంది



బస్టాండ్ పై భాగంలో రంధ్రాలు పడ్డాయి. కామారెడ్డికి వెళ్లే సమయంలో అక్కడ నిలబడాలంటే భయం వేసి దూరంగా వెళ్లాము. వర్షానికి పై పెచ్చులు పూర్తిగా ఊడిపోయాయి. ప్రమాదకరంగా ఉంది. అధికారులు వెంటనే మరమ్మతు చేయకుంటే కూలిపోయే అవకాశం ఉంది. – రాఘవపల్లి అశ్వత్, దోమకొండ

ప్రజాప్రతినిధులు స్పందించాలి



బస్టాండ్ దాదాపు 35 ఏళ్ల క్రితం నిర్మించారు. ప్రస్తుతం బస్టాండ్ శిథిలావస్థకు చేరుకుంది. వర్షాలకు పూర్తిగా నాని ప్రమాదకరంగా మారింది. మరమ్మతులు వెంటనే చేపట్టకుంటే కూలిపోయే స్థితికి చేరుకుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మరమ్మతు పనులు త్వరగా చేయించాలి. – దీకొండ శంకర్, దోమకొండ

మణిపూర్ ఘటన దోషులను కఠినంగా శిక్షించాలి

దోమకొండ/మద్నూర్/కామారెడ్డి టౌన్ : మణిపూర్‌లో ఇద్దరు మహిళలను వివస్త్రలు చేసి అత్యాచారం జరిపిన నిందితులను కఠినంగా శిక్షించాలని నేషనల్ ఉమెన్ రైట్స్ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు దాస్ ఎల్లం, ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శి జబ్బర్ నాయక్‌తో పాటు ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. దోమకొండ, మద్నూర్, కామారెడ్డి జిల్లా కేంద్రంలో వేర్వేరుగా వారు మాట్లాడి నిరసన తెలిపారు. దేశంలో అత్యాచారాలు పెరుగుతున్నాయని, ప్రజాస్వామ్యం కూనీ అవుతోందని వారు ఆరోపించారు. అల్లర్లు జరుగుతున్నా ప్రభుత్వం మౌనంగా ఉండటం ఏంటని ప్రశ్నించారు. ఈ ఘటనతో మహిళల్లో అభద్రతా భావం పెరుగుతోందని, సీరియస్‌గా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.



మద్నూర్: నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, శాసన సభ్యులు గంప గోవర్ధన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలు పొందాలని బీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకుడు గంప శశాంక్ కోరారు. శనివారం ఆయన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం మాట్లాడారు. ప్రముఖ కంపెనీలు మేళా నిర్వహించి ఉద్యోగాలు ఇస్తారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యువజన విభాగం పట్టణ అధ్యక్షుడు భానుప్రసాద్, మండల అధ్యక్షులు అనిల్ రెడ్డి, నాయకులు పృథ్వీరాజ్, నితిన్ రెడ్డి ఉన్నారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయండి



కామారెడ్డి టౌన్: సీపీఎస్ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని ప్రభుత్వ వైద్యుల సంఘం ప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ సీపీఎస్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న పాత పెన్షన్ సంకల్ప రథయాత్ర పోస్టర్లను శనివారం జిల్లా కేంద్ర ఆసుపత్రిలో వైద్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడారు. ఈనెల 25వ తేదిన జిల్లాకు రాబోయే యాత్రను ఉద్యోగులు జయప్రదం చేయాలని కోరారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ విజయలక్ష్మి, వైద్యులు సుజాత, నాగేందర్, తదితరులున్నారు.

‘దాశరథి జీవితం స్ఫూర్తిదాయకం’

కామారెడ్డి అర్బన్: తెలంగాణ ప్రజల కన్నీళ్లను అగ్నిధారగా మలిచి అక్షరాలను ఎక్కుపెట్టిన వైతాళిక కవి దాశరథి కృష్ణమాచార్యులని తెలంగాణ రచయితల వేదిక(తెరవే) జిల్లా అధ్యక్షుడు గఫూర్ శిక్షక్ అన్నారు. దాశరథి జయంతి సందర్భంగా శనివారం స్థానిక కర్షక్ బీఎడ్ కళాశాలలో తెరవే ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాహితీ కార్యక్రమంలో పలువురు కవులు పాల్గొని దాశరథి రచనలను ఉటంకించారు. ఆయన జీవితం స్ఫూర్తిదాయకమన్నారు. తెరవే జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లి మోహన్‌రాజ్, ప్రతినిధులు పాల్గొన్నారు.

శ్రీరాం నారాయణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

బాన్సువాడ రూరల్: శ్రీరాం నారాయణ ప్రభుత్వ డిగ్రీకళాశాలో ప్రిన్సిపల్ గంగాధర్ ఆధ్వర్యంలో దాశరథి 99వ జయంతి వేడుకలు జరుపుకున్నారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా గర్జించిన ధీరుడు దాశరథి అని ప్రిన్సిపాల్ కొనియాడారు. అధ్యాపకులు వెంకట్‌రావు, అంబయ్య, కృష్ణ, శంకర్‌రావు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న తెరవే ప్రతినిధులు

పీర్ల పండుగ ప్రారంభం

బాన్సువాడ రూరల్: నెలవంక కనిపించడంతో గ్రామాల్లో పీర్ల పండుగ సందడి ప్రారంభమైంది. ఆయా గ్రామాల్లోని ఆశీర్ ఖానాల్లో భక్తిశ్రద్ధలతో పీర్లను ప్రతిష్ఠించారు. పచ్చని పందిళ్లు వేసి, అగ్ని గుండాలను(అలాయి)లను సిద్ధం చేస్తున్నారు. పల్లెల్లో పీర్ల పండుగను హిందూ–ముస్లీం సోదరులు కలిసి మెలిసి జరుపుకుని మతసామరస్యాన్ని చాటుతారు. రోజుకో పీరును బంగారు, వెండి ఆభరణాలు, పల్లెపూలతో అందంగా అలంకరించి గ్రామాల్లో బాజాభజంత్రీల నడుమ ఊరేగిస్తారు. భక్తులు ఊదు–బెల్లం, మలిదరొట్టెలు, షర్బత్, ఖిచ్డి నిపీర్లకు నైవేద్యంగా సమర్పిస్తారు. బాన్సువాడ మండలం సోమేశ్వర్‌లో మొగులాలీ పీర్ల సవారీని ప్రత్యేకంగా జరుపుకుంటారు. షహదత్ పేరుతో నిర్వహించే జాతరతో పీర్ల పండుగ ఉత్సవాలు ముగుస్తాయి.



బోర్లంలోని ఆశీర్‌ఖానాలో కొలువుదీరిన పీరీలు

కంపోస్టుషెడ్లతో జీపీలకు అదనపు ఆదాయం

కామారెడ్డి రూరల్: కంపోస్టుషెడ్ల నిర్మాణంతో జీపీలకు ఆదాయం సమకూరుతుందని ఎంపీవో మలహరి అన్నారు. మండలంలోని ఉగ్రవాయిలో నిర్మించిన కంపోస్టు షెడ్డులో తయారు చేసిన ఎరువుకు శనివారం వేలం వేయగా రూ.13,300 ఆదాయం వచ్చినట్లు ఎంపీవో తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ విధంగా కంపోస్టుషెడ్లలో ఎరువులను తయారు చేసుకుని జీపీలకు ఆదాయం సమకూర్చుకోవాలని సూచించారు. కార్యదర్శి సబిత్‌రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ రాజేశ్వర్‌రావు ఉన్నారు.

‘వ్యవసాయానికి 24 గంటల కరెంట్ ఇస్తున్నాం’

రామారెడ్డి: రైతులకు నాణ్యమైన 24 గంటల కరెంట్‌ను ఇస్తున్నామని రామారెడ్డి ఎంపీపీ దశరథ్‌రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం పోసానిపేట సబ్‌స్టేషన్‌ను రైతులు, బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన సందర్శించారు. ఎంపీపీ మాట్లాడుతూ.. తెలంగాణ రాకముందు వ్యవసాయానికి ఏడు గంటల విద్యుత్ రెండు విడతలుగా ఇచ్చేవారని, పరిశ్రమలకు పవర్ హాలిడే ఇచ్చే పరిస్థితి ఉండేదని గుర్తు చేశారు. సబ్‌స్టేషన్ సిబ్బందిని రెగ్యులర్ చేసి జీతాలు పెంచిన ఘనత కేసీఆర్‌దే అన్నారు.

ఉప్పరి సంఘం భవనానికి భూమిపూజ

ఎల్లారెడ్డి: పట్టణంలో ఉప్పరి సంఘం భవనానికి మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ శనివారం భూమిపూజ చేశారు. పనులు నాణ్యతగా చేయాలని నిర్వాహకులకు సూచించారు. ఉప్పరి సంఘం నాయకులు అశోక్, బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్ తదితరులున్నారు.

రజకులకు న్యాయం చేయాలని ర్యాలీ

బాన్సువాడ: రజకులకు న్యాయం చేయాలని కోరుతూ శనివారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా నుంచి ర్యాలీ నిర్వహించారు. గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రజకుల కులవృత్తి ఇస్త్రీని కొందరు చేస్తుండటంతో రజకులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, రజకుల పొట్ట గొడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నేతలు మ్యాతరి సాయిలు, సాయిబాబా, పర్వయ్య, మహేష్, సాయిరాం ఉన్నారు.

సమాచారం..

■ నేడు ఇస్కాన్ భగవద్గీత సత్సంగం

కామారెడ్డి అర్బన్: ఇస్కాన్ కామారెడ్డి శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 11 నుంచి ఒంటి గంట వరకు భగవద్గీత సత్సంగం, భజనలు, కీర్తనలు, అన్నప్రసాదం కార్యక్రమాలుంటాయని ఇస్కాన్ ప్రతినిధి వెంకటదాస్ తెలిపారు. రామారెడ్డి రోడ్డులోని మెడికల్ అసోసియేషన్ భవనంలోని ఇస్కాన్ సెంటర్‌లో కార్యక్రమాలుంటాయని ఆయన పేర్కొన్నారు.

■ జ్ఞాన చైతన్యానంద స్వామి ప్రవచనాలు

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి ఎన్జీవోస్ కాలనీ సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో ఈనెల 23న ఉదయం 9 నుంచి 10–30 గంటల వరకు బ్రహ్మశ్రీ జ్ఞాన చైతన్యానంద స్వామి ప్రవచనాలు, సత్సంగం ఉంటుందని శ్రీగీతామందిరం ప్రతినిధి అర్వపల్లి రమేష్ తెలిపారు.

పంటలోని నీటిని తొలగించాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): పంటలో వర్షపు నీరు ఉన్నట్లయితే వెంటనే తొలగించాలని మండల వ్యవసాయాధికారి శ్రీకాంత్ సూచించారు. ఆయన శనివారం సోమారం శివారులో నీట మునిగిన పంటలను పరిశీలించారు. ఆయన వెంట ఏఈవో లికిత్‌రెడ్డి, రైతులు ఉన్నారు.

నీరు తగ్గే వరకు ఎలాంటి ఎరువులు వేయొద్దు

రామారెడ్డి: భారీ వర్షాలకు పంట పొలాల్లో నీరు భారీగా నిల్వ ఉన్నాయని పంట పొలాల నుంచి నీరు వెళ్లే వరకు ఎలాంటి ఎరువులు వేయొద్దని, మందులు పిచికారీ చేయవద్దని ఎల్లారెడ్డి ఏడీఏ రత్న రైతులకు సూచించారు. శనివారం రామారెడ్డి, అన్నారం, పోసానిపేట గ్రామాలలోని పత్తి, మొక్కజొన్న పంటలను ఏవో హరీష్‌తో కలిసి పరిశీలించారు.

శిథిలావస్థకు చేరిన ఇళ్లలో ఉండకండి

కామారెడ్డి టౌన్: మున్సిపల్ పరిధిలో శిథిలావస్థలో, కూలడానికి సిద్ధంగా ఉన్న ఇళ్లలో ఉండకుండా ఖాళీ చేయాలని మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి గిరిధర్ కోరారు. శనివారం పట్టణంలోని 46, 47వ వార్డుల్లో ఆయన పర్యటించి పరిశీలించారు. కూలిపోడానికి సిద్ధంగా ఉన్న ఇళ్ల వివరాలను నమోదు చేసుకున్నారు. టీపీఎస్ రాజేష్, కౌన్సిలర్లు కోయల్‌కార్ కన్నయ్య, గెరిగంటి స్వప్న పాల్గొన్నారు.



సోమారంలో పంటలను పరిశీలిస్తున్న అధికారులు

ఈవీఎంలపై అవగాహన

ఎల్లారెడ్డి: కళ్యాణి, అన్నాసాగర్ గ్రామాలలో ఈవీఎంలు, వీవీప్యాట్‌లపై శనివారం ఎంపీవో ప్రకాష్ అవగాహన కల్పించారు. ఓటర్లు ఓటు వేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. సర్పంచులు నాగరాజు, రఘువీర్‌గౌడ్, పంచాయతి కార్యదర్శులు ప్రసాద్, హరీష్, గ్రామస్తులున్నారు.

బీఎల్‌వోలకు ఓటరు జాబితాపై శిక్షణ

లింగంపేట(ఎల్లారెడ్డి): స్థానిక తహసీల్ కార్యాలయంలో శనివారం బీఎల్‌వోలకు ఓటరు జాబితాపై తహసీల్దార్ చంద్ర రాజేశ్వర్ శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీఎల్‌వోలు తమకు కేటాయించిన గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ఓటర్ల సర్వే నిర్వహించాలని సూచించారు. ఆర్ఐ బాలయ్య, బీఎల్‌వోలు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎంపీవో ప్రకాష్

పలు చోట్ల కూలిన ఇళ్లు



ఎల్లారెడ్డిలో వర్షానికి కూలిన ఇల్లు



ఉత్నూర్‌లో..

జిల్లా వ్యాప్తంగా ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పలు గ్రామాల్లో ఇళ్లు కూలాయి. కొన్ని గృహాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. శనివారం వర్షం కాస్త తెరపివ్వడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. దెబ్బతిన్న ఇళ్లను స్థానిక ప్రజాప్రతినిధులతో పాటు అధికారులు పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. నష్ట పరిహారం ఇప్పించి ఆదుకోవాలని ఇళ్లు కూలిన బాధితులు వేడుకున్నారు. కొన్ని గ్రామాల్లో పంటలు నీట మునిగాయి. చెరువులు అలుగెళ్లాయి. – సాక్షి నెట్‌వర్క్



టికారాం తండాలో..



పోచారం వెళ్లే దారిలో కొట్టుకుపోయిన బ్రిడ్జిని పరిశీలిస్తున్న ఎంపీడీవో రాణి



భిక్కనూరులో..



క్రిష్టాజివాడి చెరువు అలుగు ద్వారా పోతున్న నీరు



దుర్కిలో నీట మునిగిన పంట పొలాలు



ఉధృతంగా ప్రవహిస్తున్న హన్మాజీపేట్ మత్తడి

అధ్వానంగా మారిన రోడ్లు

లింగంపేట/తాడ్వాయి: గత ఐదు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా తండాల రోడ్లు అధ్వానంగా మారాయి. వాహనాలు రోడ్లపై నడిచే పరిస్థితి లేక గిరిజనులు నానా అవస్థలు పడుతున్నారు. కొన్ని తండాలకు కేవలం మట్టి రోడ్లు మాత్రమే ఉండడంతో ప్రతీ ఏటా రోడ్లు భారీ వర్షానికి కొట్టుకుపోయి నడవడానికి సైతం ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొందని ఆయా తండాల గిరిజనులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్లు మరీ ఘోరంగా తయారయ్యాయి.



లింగంపేట: రాకపోకలకు ఇబ్బందిగా మారిన గట్టుమైసమ్మ తండా రోడ్డు



కొట్టాల్‌గడ్డ తండాలో ..



తాడ్వాయి మండల కేంద్రానికి వెళ్లే రోడ్డు

సంక్షిప్తం

ఉచిత వైద్య శిబిరం

బాన్సువాడ రూరల్: ఇబ్రహీంపేట్‌లో సీఎస్సీ ఆస్పత్రి ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఉచితంగా మందులు అందజేశారు. సర్పంచ్ నారాయణరెడ్డి, పంచాయితీ కార్యదర్శి నవీన్, డాక్టర్ అమీర్ పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో..

కామారెడ్డి టౌన్: సీఐటీయూ, తెలంగాణ బిల్డింగ్ అదర్ కన్స్ట్రక్షన్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని హరిజనవాడలో వైద్య శిబిరం నిర్వహించారు. భవన నిర్మాణ కార్మికులకు, మేస్త్రీలకు, కార్మికులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు.

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి

నస్రుల్లాబాద్(బాన్సువాడ): ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ఏఎస్సై అబీద్ బేగ్ సూచించారు. శనివారం మండల కేంద్రంలో వాహన తనిఖీలో భాగంగా సరైన ధ్రువపత్రాలు లేని వాహనదారులకు జరిమానాలు విధించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక చేయూత

రాజంపేట: శేర్‌శంకర్ తండా జీపీ పరిధిలోని మూడు మామిళ్లతండాలో పాము కాటుకు గురై తండ్రీ కుమారులు మద్రిచ్చ రవి, వినోద్‌లు మరణించిన విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నేత మదన్ మోహన్ రావు బాధిత కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం చేశారు. స్థానిక నాయకులు బాలేందర్, సాయిలు, సరిలాల్ చేతుల మీదుగా సాయం అందజేశారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

దోమకొండ: మండలానికి చెందిన నిరుద్యోగులు ఆదివారం కామారెడ్డి డిగ్రీ కళాశాలలో జరిగే ఉద్యోగ మేళాను సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. సీడీసీ చైర్మన్ ఐరేని నర్సయ్య, శంకర్‌రెడ్డి ఉన్నారు.

రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలి

కామారెడ్డి రూరల్: కొత్తగా పట్టా పాస్‌బుక్ పొందిన రైతులు వెంటనే రైతు బీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని కామారెడ్డి మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్‌రావు సూచించారు. 18 నుంచి 59 యేళ్ల లోపు వారు ఆగస్టు 5వ తేది లోపు దరఖాస్తు ఫాం, పాస్‌బుక్ , ఆధార్ కార్డు, నామినీ ఆధార్ కార్డు జిరాక్స్‌లతో సంప్రదించాలన్నారు.

సంకల్ప యాత్రను విజయవంతం చేయాలి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): పాత పెన్షన్ సాధన సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని సీపీఎస్ ఉద్యోగుల సంఘం మండలాధ్యక్షుడు కృష్ణాకర్ కోరారు. ఆయన మాటాడుతూ.. యాత్ర ఈ నెల 25న కామారెడ్డి జిల్లాలోకి ప్రవేశిస్తుందని, రాజారెడ్డి గార్డెన్‌లో సభ ఉంటుందన్నారు.

సీఎం, ఎమ్మెల్యే, ఎంపీ ఫొటోలకు పాలాభిషేకం

మద్నూర్(జుక్కల్): మద్నూర్‌కు డిగ్రీ కళాశాల మంజూరు ఉత్తర్వులు వెలువడడంతో శనివారం మండల కేంద్రంలోని జీపీ కార్యాలయ ఆవరణలో సీఎం, ఎమ్మెల్యే, ఎంపీ ఫొటోలకు పాలాభిషేకం చేశారు. బాణాసంచా కాల్చి స్వీట్లు తినిపించుకుంటూ సంబరాలు జరుపుకున్నారు.

కొనసాగుతున్న స్వీపర్ల దీక్షలు

కామారెడ్డి రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసే పార్ట్ టైం స్వీపర్లను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం అమలు చేయాలని కోరుతూ కామారెడ్డి ఆర్డీవో కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మె శనివారం నాటికి 19వ రోజుకు చేరుకుంది. సిద్ధిరాములు, సహదేవ్, వీరేశం, తదితరులు పాల్గొన్నారు.